సాక్షి సిద్దిపేట

బుధవారం । 22 । నవంబర్ । 2023



స్టేట్‌మీట్‌కు వర్గల్ రెడీ

బాలికల స్టేట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌కు వర్గల్ జ్యోతిబా పూలే బాలికల గురుకులం ముస్తాబైంది. బుధవారం నుంచి నాలుగు రోజులపాటు ఆటలు కొనసాగనున్నాయి. వివరాలు 10లో▸



స్త్రీ విలువను తెలిపేది రామాయణం

స్త్రీ విలువల గురించి పూర్తిస్థాయిలో తెలుసుకోవాలంటే రామాయణం చదవాలని ఆచార్య త్రివేణి అన్నారు. వివరాలు 10లో▸

అద్దె ప్రాతిపదికన బస్సులు

సిద్దిపేటకమాన్: శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం సిద్దిపేట డిపో నుంచి తక్కువ చార్జీలతో అద్దె ప్రాతిపదికన బస్సులు అందుబాటులో ఉన్నాయని డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99592 26271 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నిబంధనలు ఉల్లంఘించిన వారికి జైలు, జరిమానా



మాట్లాడుతున్న శ్వేత

సిద్దిపేటకమాన్: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వారిలో ఒకరికి జైలుశిక్ష, మరొకరికి జరిమానా విధించిన ఘటన సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీపీ శ్వేత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మర్కూక్ మండలం పాములపర్తికి చెందిన మ్యాకల రమేశ్ (38)ను, మద్దూరు మండలం నర్సాయపల్లికి చెందిన బద్దిపడగ కృష్ణారెడ్డి (40)లపై గతంలో కేసులు ఉన్నందున వీరిని ఆయా తహసీల్దార్‌ల ఎదుట హాజరుపర్చారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన రమేశ్‌కు ఏడాది జైలు, కృష్ణారెడ్డికి రూ.50వేల జరిమానా విధించినట్లు తెలిపారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

ప్రయోగాత్మక విద్యతో లబ్ధి



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న కళాశాల అధ్యాపకులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు మూస ధోరణితో కాకుండా ప్రయోగాత్మకంగా విద్యను నేర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రపంచ మత్స్య దినోత్సవం పురస్కరించుకొని కళాశాలలో మత్స్య శాస్త్ర విద్యార్థినీవిద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ హాజరయ్యారు. అనంతరం ప్రదర్శనలను వీక్షించారు. విద్యార్థులు ఇలాంటి ప్రయోగాలు చేయడం ఆహ్వానించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో జంతు, మత్స్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ అయోధ్యరెడ్డి, అధ్యాపకులు విశ్వనాథం, మధుసూదన్ రెడ్డి, వెంకటేష్, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను మభ్యపెడుతున్న బీఆర్ఎస్

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

సిద్దిపేటరూరల్: అమలుకాని హామీలు గుప్పిస్తూ బీఆర్ఎస్ పార్టీ.. ఓటర్లను మభ్యపెడుతోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జిల్లెల్ల రమేశ్ అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు మేనిఫెస్టోలోలేని అంశాలను సైతం చెబుతూ తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో డబుల్‌బెడ్రూంలు ఎందరికి అందాయో చూపించాలన్నారు. నిరుద్యోగుల జీవితాలను బీఆర్ఎస్ నాశనం చేసిందన్నారు. కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల ప్రచార కమిటీ చైర్మన్ బుగ్గరాజు, మండల ప్రధాన కార్యదర్శి బాబు, అశోక్, మాటిండ్ల గ్రామశాఖ అధ్యక్షుడు నర్సయ్య, సీనియర్ నాయకులు రాజిరెడ్డి, బొంగురం రాజిరెడ్డి, నవీన్, మల్లారెడ్డి, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో నవీన్ మిట్టల్



పూజల అనంతరం కమిషనర్ దంపతులకు ప్రసాదాలు అందిస్తున్న పూజారులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మను మంగళవారం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్స్ అడ్మినిస్ట్రేషన్ నవీన్ మిట్టల్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి, అర్చకులు వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజారి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట మెదక్ అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ ఉన్నారు.



రోడ్‌షోకు హాజరైన ప్రజానీకం

కొత్తాకు పట్టం కట్టండి

అభివృద్ధికి నేను జిమ్మేదారి

- సీఎం కేసీఆర్ వెంటే యువత
- పైసా పనిచేయని రఘునందన్‌ను చిత్తుగా ఓడించాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్
- దుబ్బాకలో రోడ్ షో



దౌల్తాబాద్ రోడ్ షో లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

దుబ్బాకటౌన్/దౌల్తాబాద్: 'యువతరం సీఎం కేసీఆర్ వెంటే ఉంది.. కాంగ్రెస్, బీజేపోళ్లు చెప్పే ఫాల్త్ మాటలు నమ్మవద్దు.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం' అని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్‌లో దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికలు మీ తలరాతలు మార్చేవని, ఏ మాత్రం పొరపాటు చేసినా బతుకులు ఆగమవుతాయన్నారు.

కేసీఆర్ పుట్టి, పెరిగిన గడ్డ ఇది..

దుబ్బాక అంటే సీఎం కేసీఆర్ పుట్టి, పెరిగి, విద్యాబుద్ధులు నేర్చిన గడ్డ అని ఈ ప్రాంతంమన్నా.. ప్రజలన్నా సీఎం కేసీఆర్‌కు ఎంతో అభిమానమని కేటీఆర్ అన్నారు. దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధికి నేను, మంత్రి హరీశ్‌రావు జిమ్మేదారి అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తీసుకొంటామన్నారు.

ఓటుతో బుద్ధి చెప్పాల్సిందే..

ఉప ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి గెలిచిన రఘునందన్‌రావు పైసా పని చేసిండా.. ఒక్క హామీ అయినా నెరవేర్చిండా అని ప్రజలు ఆలోచించాలని మంత్రి కేటీఆర్ అన్నారు. అబద్ధాలు ఆడి గద్దె నెక్కిన రఘునందన్‌ను ప్రజలు చిత్తుగా ఓడించాలన్నాని పిలుపునిచ్చారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డి చేసిన పనులకు కొబ్బరికాయలు కొట్టిన వ్యక్తి.. మళ్లీ ఇప్పుడు దగాకోరు మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు.

భారీగా హాజరైన జనం..

బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా దౌల్తాబాద్‌లో నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్ షోకు నియోజక వర్గం నలుమూలల నుంచి భారీగా జనం హాజరయ్యారు. ముఖ్యంగా యువ సమ్మేళనం రోడ్ షో కావడంతో యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దౌల్తాబాద్‌లో ప్రధాన రోడ్లన్నీ గులాబీ మయమయ్యాయి.



హుస్నాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన జనం

సతీశ్‌కుమార్‌ను ఆదరించండి

ప్రగతికి నాది జవాబుదారి

- అక్కన్నపేట మండలాన్ని దత్తత తీసుకుంటా
- తండాలను గ్రామపంచాయతీలు చేసిన ఘనత కేసీఆర్‌దే
- యాసంగి పంటలకు గౌరవెల్లి ద్వారా సాగునీరు
- మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్‌లో రోడ్ షోలు



అక్కన్నపేటలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

హుస్నాబాద్/అక్కన్నపేట/కోహెడ: ముచ్చటగా మూడో సారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. హుస్నాబాద్ నియోజవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్ కుమార్‌కు మద్దతుగా మంగళవారం పలుచోట్ల రోడ్‌షోలు నిర్వహించారు. హాజరైన మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజక వర్గం మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందన్నారు. మచ్చలేని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు హ్యాట్రిక్ విజయం అందించాలని కోరారు. అక్కన్నపేట మండలాన్ని దత్తత తీసుకుంటానన్నారు. గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి కాకుండా అడ్డుకున్నది కాంగ్రెస్ అని, అయినా ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలతో నింపామన్నారు. ఈ యాసంగి సీజన్‌లో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. ఈ వచ్చే నెల 3వ తేదీ తర్వాత వడ్డీతో సహా రుణమాఫీ చేస్తామన్నారు.

జలకళతో ప్రాజెక్టులు..

కోహెడ మోయతుమ్మెద వాగుపై ఎనిమిది చెక్‌డ్యాంలు నిర్మించామన్నారు. శనిగరం, సింగరాయ ప్రాజెక్టులు జలకళతో నిండుకుండలాగా ఉన్నాయన్నారు. సాగు నీటి సమస్యను తీర్చిమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్న అసైన్డ్ భూములను పట్టా భూములుగా మారుస్తామన్నారు. కోహెడలో డిగ్రీ కళాశాల, ఓపెన్ జీమ్, మినీ స్టేడియం మంజూరు చేస్తామన్నారు. మండలానికి సంపూర్ణంగా సహకారం అందిస్తామన్నారు.

మూడు దిక్కులా గోదావరి జలాలు

సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్ విలీనం తర్వాత మూడు దిక్కులా గోదావరి జలాలను అందించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశామని మంత్రి హరీష్‌రావు అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ కోతల రాయుడని మాటలే తప్ప చేతలు లేవన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన హుస్నాబాద్‌లో తాగు, సాగునీటికి ఢోకా లేదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ భూక్య మంగ తదితరులు పాల్గొన్నారు.

హోం.. ఓటింగ్

- జిల్లాలో 2,011 మందికి అవకాశం
- 13 విభాగాల్లో పని చేసే 1,554 సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

నియోజకవర్గం	80ఏళ్లు పైబడిన	దివ్యాంగులు	ఎమర్జెన్సీ	మొత్తం
హుస్నాబాద్	209	232	14	455
సిద్దిపేట	523	216	18	757
దుబ్బాక	321	99	11	431
గజ్వేల్	292	74	02	368

సాక్షి, సిద్దిపేట: వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించే అవకాశం కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఈ నెల 8 వరకు దివ్యాంగులు, వయో వృద్ధుల నుంచి 12డీ దరఖాస్తులను స్వీకరించారు. వాటిని పరిశీలించి ఓటును వినియోగించే అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 2,011 మంది ఇంటి నుంచి, 13 శాఖల్లో విధులు నిర్వర్తించే 1,554 మంది సిబ్బందికి సైతం పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించారు. దరఖాస్తులను ఆయా ఆర్‌ఓ కేంద్రాలకు పంపించారు.

ఈ నెల 24వ తేదీ వరకు

ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 24 వరకు పోలింగ్ ప్రక్రియ జరగనుంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇంటి నుంచి ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ తేదీల్లో ఒక్కో ఓటరు ఇంటికి రెండు మార్లు వెళ్లనున్నారు. ఒక సారి ఓటు వేసేందుకు వీలు లేని వారికి మరో అవకాశం ఇస్తున్నారు. రెండు మార్లు పోలింగ్ సిబ్బంది ఇంటికి వచ్చిన సమయంలోనూ లేకపోతే ఇక ఓటును వినియోగించుకునే అవకాశం ఉండదు.

ఇంట్లోనే బూత్

ఎన్నికల నిబంధనల ప్రకారం ఇంట్లోనే ఓటు వేసే సమయంలో ఎవరూ చూడకుండా ఉండే విధంగా తాత్కాలికంగా బూత్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆర్‌ఓ ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ముగ్గురు అధికారులు, వీడియో గ్రాఫర్, మైక్రో అబ్జర్వర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు. సెక్టార్ల పరిధిలో ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటు వేయిస్తున్నారు. ఫారం 13ఏ అటెస్టేషన్ కోసం, ఫారం 13బీ బ్యాలెట్ పేపర్‌లో వివరాలు పూర్తి చేసి బ్యాలెట్ పెట్టెలో వేయిస్తున్నారు.

సిద్దిపేటలో అత్యధికం

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సిద్దిపేటలో అత్యధికంగా ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకునే వారు ఉన్నారు. అత్యల్పంగా గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్నారు. దుబ్బాకలో ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం ఇప్పటికే పూర్తి కావచ్చింది.



నంగనూరులో ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకుంటున్న వృద్ధురాలు

అత్యవసర విభాగాల్లో..

అత్యవసర విభాగాల్లో విధులు నిర్వర్తించే వారికి సైతం ఓటు వేసే అవకాశం కల్పించారు. ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే జిల్లా ఎన్నికల అధికారికి దరఖాస్తు చేస్తే అవి జిల్లాకు చేరాయి. వాటిని పరిశీలించి నాలుగు నియోజకవర్గాల పరిధిలో 1,554 మందికి బ్యాలెట్‌లను ఆయా జిల్లాలలకు పంపించారు. అక్కడ ఓటు హక్కును వినియోగించుకున్న తర్వాత ఆయా జిల్లా ఎన్నికల అధికారుల నుంచి మళ్లీ జిల్లాకు చేరనున్నాయి.

హుస్నాబాద్	263
సిద్దిపేట	515
దుబ్బాక	404
గజ్వేల్	372

ఓటు వినియోగంపై అవగాహన

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- ఫ్లెక్సీని ఆవిష్కరించిన కలెక్టర్



ఓటు వేసే విధానం చూపే ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

సిద్దిపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే విధానంపై ప్రతీ ఒక్క పోలింగ్ కేంద్రం వద్ద అవగాహన కల్పిస్తామని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల సంఘం ద్వారా ఓటు వేసే విధానంపై ముద్రించిన ఫ్లెక్సీని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై పోలింగ్ కేంద్రంలో ఫ్లెక్సీ ప్రదర్శించి ఎంచుకున్న అభ్యర్థికి ఎలా ఓటు వేయాలో అవగాహన కల్పిస్తామని, అదేవిదంగా పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని ఓటర్లందరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌ఓ రవికుమార్, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్...

సిద్దిపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సక్రమంగా నిర్వహించేందుకు గాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. పోలింగ్ రోజున నిర్వహించే అత్యవసర విధులు, సౌకర్యాలు, ఓటర్ల జాబితా వివరాలు, ఓటర్ స్లిప్పుల పంపిణీ, ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్, రిసెప్షెన్ కేంద్రాల ఏర్పాటు వంటి వాటిని వేగిరం చేయాలని వికాస్‌రాజ్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ నాగరాజమ్మ, సిద్దిపేట ఆర్‌ఓ రమేశ్‌బాబు, ఎలక్షన్ డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే..

- వారి మాయమాటలు నమ్మొద్దు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

బెజ్జంకి(సిద్దిపేట): బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒక్కటేనని, వారి మాయ మాటలు నమ్మి మోసపోవద్దని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. బెజ్జంకిలో మంగళవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానకొండూర్ బీజేపీ అభ్యర్థి, మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లె మోహన్ పక్కా లోకల్ అని, ఆయనను గెలిపిస్తేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. స్థానికేతరులు ఎన్నికల కోసమే వస్తారని, ఓడినా మీవెంట ఉన్న ఆరెపల్లె మోహన్‌కు ఈఎన్నికల్లో అవకాశమివ్వాలని కోరారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే తెలంగాణలోఅభివృద్ధి జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన సంక్షేమ పథకాలు అమలు కాలేదని, కేంద్రం నిధులను కూడా పూర్తిగా వాడకుండా మోసగించారని ఆరోపించా రు. బీజేపీకి అండగా నిలిచి కమలం గుర్తుకు ఓటు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆరెపల్లె మోహన్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగిడి కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు కరివేద మహిపాల్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.



బెజ్జంకి రోడ్ షోలో మాట్లాడుతున్న బండి సంజయ్

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



గంగాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ

డీఆర్‌డీఓ పీడీ జయదేవ్ ఆర్య

చిన్నకోడూరు(సిద్దిపేట): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ పీడీ జయదేవ్ ఆర్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గంగాపూర్ ఐకేపీ వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. టోకెన్ విధానంలో కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులు, నిర్వాహకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీఎం మహిపాల్, సీసీలు కొమురయ్య, శ్రీనివాస్ రెడ్డి, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలను ఈ నెల 24న అక్కన్నపేట మండలం రామవరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి జంగపల్లి వెంకట నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు అండర్ 14, 17 బాలబాలికలకు మాత్రమేనని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలనే క్రీడాకారులు తమ సంబంధిత పాఠశాలల నుంచి జనన ధ్రువీకరణ పత్రాలు, సొంత సైకిలు, హెల్మెట్‌తో హాజరుకావాలన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం కూడా ఉంటుందన్నారు. ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారులను రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9494876376, 9121588647, నంబర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

చెక్‌పోస్ట్‌ల పాత్ర కీలకం

చిన్నశంకరంపేట(మెదక్): ఎన్నికల సమయంలో అక్రమాలు అరికట్టడానికి చెక్‌పోస్టులు కీలక పాత్ర పోషిస్తాయని మెదక్ జిల్లా ఎన్నికల పరిశీలకుడు, డీఐజీ సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం రాత్రి చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రధాన రహదారులపై ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరగాలంటే చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని అన్నారు. అనంతరం ఎస్ఎస్‌టీ సిబ్బంది వాహనాల తనిఖీ రికార్డులను పరిశీలించారు.

ఓటేసిన ఫెసిలిటేటర్లు


మాట్లాడుతున్న అధికారి వెంకారెడ్డి

జహీరాబాద్: మండలంలోని రంజోల్ గ్రామంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో 199 మంది ఫెసిలిటేటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వెంకారెడ్డి తెలిపారు. మంగళవారం ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. అందోల్ నియోజకవర్గానికి సంబంధించి 23 మంది, సంగారెడ్డి సంబంధించి 66, పటాన్‌చెరు 9, నారాయణఖేడ్ 98, జహీరాబాద్ ఇద్దరు, మిగతా జిల్లాకు సంబంధించి ఒకరు వంతున ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ప్రలోభాలకు గురిచేస్తే ఫిర్యాదు చేయాలి


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న జవాన్లు, పోలీసులు

కొండపాక(గజ్వేల్): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పిస్తామని, ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని త్రీటౌన్ సీఐ.భానుప్రకాశ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన దుద్దెడ, మర్పడ్గ, సిర్సనగండ్ల గ్రామాల్లో మంగళవారం కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భానుప్రకాశ్ మాట్లాడుతూ అభ్యర్థులు ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే సీ-విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1950కి కూడా కాల్ చేయవచ్చన్నారు.

అన్నా.. మిర్చీలేస్తా.. ఓటెయ్యాలె

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సునీతారెడ్డికి ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఓ బండి వద్ద నాయకులు బజ్జీలు వేయించి ఓటర్లను ఆకట్టుకున్నారు.


బజ్జీలు వేస్తున్న నాయకులు

ఉద్యమంలో కేటీఆర్ ఎక్కడున్నాడు?

- బీఆర్ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా దుబ్బాకలో గెలిచేది నేనే..
- బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్‌కు తగిన బుద్ధి చెప్పే సమయం దగ్గర్లోనే ఉందని దుబ్బాక బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దుబ్బాక నియోజకవర్గంలోని దుబ్బాక, మిరుదొడ్డి, చేగుంట మండలాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ఎక్కడున్నాడని.. సంస్కారహీనంగా మాట్లాడుతున్న ఆయన అమెరికాలో ఉండి ఏం పనులు చేశాడో అందరికీ తెలుసన్నారు. తండ్రి పేరు చెప్పుకుని గెలిచాడని ఎద్దేవా చేశారు. దౌల్తాబాద్‌లో కేటీఆర్ తనపై మాట్లాడిన భాష సరిగా లేదని, తల్లి దండ్రులు మంచి సంస్కారం నేర్పారు కాబట్టే తాను అలా మాట్లాడటం లేదన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఆరడుగుల బుల్లెట్ అంటూ వచ్చిన మీ బావతోనే ఏం కాలేదు.. ఇక నీతో ఏం అవుతుందని ఘాటుగా మాట్లాడారు. కేటీఆర్ అహంకారపు మాటలు మానుకోవాలని హెచ్చరించారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం

తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమని.. బీసీ సీఎం కావడం పక్కా అన్నారు. 'దుబ్బాక గడ్డ మీద మీ నాయన, నువ్వు, మీ బావ ఎన్ని వేషాలు వేసినా నడవవని.. చైతన్యం గల ఇక్కడి ప్రజలు నన్ను మళ్లీ గుండెల్లో పెట్టుకొని గెలిపించుకుంటారని' అన్నారు. ఓటమి భయంతోనే బీఆర్ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.

దుబ్బాకకు ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలి

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్ఎస్ పార్టీ రెండు సార్లు అధికారంలో ఉండి దుబ్బాక నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలని రఘునందన్‌రావు ప్రశ్నించారు. మోతె గ్రామంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు బీజేపీలో చేరారు. అనంతరం మాట్లాడుతూ... దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాలు తనకు రెండు కళ్లలాంటివని చెప్పుకునే మంత్రి హరీశ్.. గడిచిన ఐదేళ్లలో సిద్దిపేటకు నిధులు తరలించి దుబ్బాకను పూర్తిగా విస్మరించాడని మండిపడ్డారు. తాను గెలిచాకే అసెంబ్లీలో ప్రశ్నించి కొట్లాడి దుబ్బాకకు నిధులు తెచ్చానని చెప్పారు. దళిత బంధు, బీసీ బంధు పేరుతో నియోజకవర్గ ప్రజల ఆశలను వమ్ము చేశారన్నారు. అభివృద్ధిని విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేసిందని విమర్శించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని మండిపడ్డారు. కుటుంబ పాలనకు ఓటుతో చరమ గీతం పాడాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని, ఎన్నికల ప్రచారంలో వారు చెప్పే కల్లబొల్లి మాయ మాటలు నమ్మొద్దన్నారు. తెలంగాణ అభివృద్ధి జరుగుతోందంటే కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం వల్లనేనన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే వరికి మద్దతు ధర క్వింటాలుకు రూ. 3100 చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


మోతెలో రఘునందన్‌రావుకు తిలకం దిద్దుతున్న మహిళలు

దుబ్బాక టికెట్ ఎంతకు అమ్ముకున్నారు?

చేగుంట(తూప్రాన్): దుబ్బాక టికెట్‌ను ఎంతకు అమ్ముకున్నారో తెలపాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. చేగుంట పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ సభ్యులంతా ఉద్యమకారుల కుటుంబాలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు, దుబ్బాక దివంగత ఎమ్మెల్యే రామలింగన్న సతీమణి సుజాతక్కకు టికెట్లు ఇవ్వకుండా అమ్ముకున్నారని ఆరోపించారు. 2018లో బీఆర్ఎస్ మేనిఫెస్టోలో నిరుద్యోగులకు రూ.3016 ఇస్తామని, ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ అందిస్తామని వాటిని నెరవేర్చలేదన్నారు. డబుల్ బెడ్‌రూంలు స్థానిక నాయకులకు అమ్ముకున్నారని ఆరోపించారు. కేటీఆర్ డబ్బులు పెట్టకుండా ఎన్నికల్లో ఉన్నామని గుడికి వచ్చి ప్రమాణం చేస్తాడా అని ప్రశ్నించారు. ఇకనైనా కేటీఆర్ భాషతీరు మార్చుకోకుంటే దుబ్బాక ప్రజలే వెంట తరిమి కొట్టే రోజులు వస్తాయని పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ సిద్దిరాములు, మాజీ సొసైటీ చైర్మన్ సంద్రుగు స్వామి 200 మందితో కలిసి బీజేపీలో చేరారు. కార్యక్రమంలో భూమలింగంగౌడ్, భూపాల్, వెంగళరావు, గోవింద్, గణేష్‌రవికుమార్ పాల్గొన్నారు.


పాల్గొన్న జనం

బల్వంతాపూర్‌లో ప్రచారం

దుబ్బాక రూరల్: దుబ్బాక మండలం బల్వంతాపూర్‌లో మంగళవారం రాత్రి రఘునందన్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు భారీగా తరలివచ్చి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజులకు బీఆర్ఎస్ ఒక్క ఎమ్మెల్యే టికెట్ ఇవ్వక పోవడం సిగ్గుచేటన్నారు.

స్త్రీ విలువను తెలిపేది రామాయణం

టీయూ మానవీయ శాస్త్రాల పీఠాధిపతి త్రివేణి

సిద్దిపేట ఎడ్యుకేషన్: స్త్రీ గుణాలు, విలువల గురించి పూర్తిస్థాయిలో తెలుసుకోవాలంటే రామాయణం చదవాలని, అందులో మానవీయం పెంచే విషయాలున్నాయని తెలంగాణ విశ్వవిద్యాలయం మానవీయ శాస్త్రాల పీఠాధిపతి ఆచార్య వంగరి త్రివేణి అన్నారు. కమనీయం తెలుగు రామాయణం శాంతా వసంత ట్రస్ట్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి సిద్దిపేట తెలుగు విభాగం ఆధ్వర్యంలో రామాయణంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన త్రివేణి మాట్లాడుతూ.. సుందరకాండలో స్త్రీ, సమకాలీన స్త్రీ గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిన అంశాలు రామాయణంలో ఎన్నో ఉన్నాయని తెలియజేశారు. మన దేశ సంస్కృతి సంప్రదాయాలు నిత్యం ఆచరించదగినవని తెలిపారు. అనంతరం మొదలైన మొదటి సాంకేతిక సదస్సుకు అధ్యక్షత వహించిన తొర్రూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాములు తెలుగు రామాయణాలు కావ్య అవతారిక పై ప్రసంగించారు. ఈ సదస్సులో ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల తెలుగు సహాయ ఆచార్యులు డాక్టర్ పోగుల విశ్వప్రసాద్ విశ్వనాథ రామాయణం – జీవుని వేదన అంశంపై ప్రసంగించారు. తెలుగు అధ్యాపకులు నరేష్ భాస్కర రామాయణం, అవధానం సుజాత తెలుగు సహాయాచార్యులు, విశ్వనాథ కల్పవృక్షం, డాక్టర్ కమల సుధారాణి రామాయణం మానవీయ విలువల పైన పత్ర సమర్పణ చేశారు. అనంతరం మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బూర్ల చంద్రశేఖర్ తెలుగు సినిమా పాటల్లో సీతారాముల ప్రణయంపై మాట్లాడారు. ఈ సదస్సులో డాక్టర్ సీతారాములు తెలుగు రామాయణ అవాల్మీకాంశాలు, జంగిటి వేణు పరిశోధక విద్యార్థి తెలంగాణ విశ్వవిద్యాలయం యూట్యూబ్ జానపద పాటల్లో రామాయణం అంశంపై పత్ర సమర్పణ చేశారు. అనంతరం వరుకోలు లక్ష్మయ్య, పాతూరి కొండల్ రెడ్డి రామాయణంపై పద్య గానం చేశారు. ముగింపు సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్ హాజరై మాట్లాడుతూ రామాయణం సకల విలువలకు నెలవు అని, రామాయణం అందరూ చదివి విలువలను కాపాడాలని తెలిపారు. అలాగే వివిధ కళాశాలల తెలుగు సహాయ ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, తెలుగు రామాయణాలకు సంబంధించిన అంశాలపై పరిశోధన పత్ర సమర్పణ చేశారు. ఈ సదస్సులో తెలుగు అధ్యాపకులు, సాహితీ అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.


త్రివేణిని సన్మానిస్తున్న నిర్వాహకులు

గజ్వేల్‌కు అదనపు బ్యాలెట్ యూనిట్లు

ఉప ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గానికి 802 అదనపు బ్యాలెట్ బాక్స్‌లు అవసరమైన నేపథ్యంలో బ్యాలెట్ యూనిట్లకు కేటాయించి ర్యాండమైజేషన్ చేసినట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈవీఎంల మొదటి విడత సప్లిమెంటరీ ర్యాండమైజేషన్‌లో భాగంగా గుర్తింపు పొందిన వివిధ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అవసరమైన అదనపు బ్యాలెట్ యూనిట్లను గజ్వేల్‌కు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం కొండపాక మండల కేంద్రంలోని గోడౌన్లలో బ్యాలెట్ యూనిట్లను ఈఎంఎస్ ద్వారా స్కానింగ్ చేసి గజ్వేల్ రిటర్నింగ్ అధికారికి ఈవీఎంలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్, పార్టీల ప్రతినిధులు ఎండీ అత్తూ ఇమామ్, మజార్‌మాలిక్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

దుబ్బాక: శాసన సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్లో ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు అందిస్తున్న రెండో విడత శిక్షణ తరగతులు రెండవ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం వీటిని అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల అధికారి గరిమా అగర్వాల్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల అధికారులకు ఏ చిన్న సమస్య వచ్చినా పై అధికారులతో చర్చించాలని సూచించారు. శిక్షణలో మాస్టర్ ట్రైనర్స్ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈవీఎం మిషన్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ మిషన్‌లో పేపర్ అమర్చే విధానం, కంట్రోల్ యూనిట్ ఆపరేట్ చేయడం గురించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజు నిర్వహించే మాక్‌పోల్ ప్రక్రియ గురించి క్షుణ్ణంగా తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు గురించి ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు వెంకట్‌రెడ్డి, గోవర్ధన్ తదితరులున్నారు.

స్టేట్‌మీట్‌కు వర్గల్ రెడీ


వర్గల్ పూలే గురుకులంలోని మైదానం

- పూలే గురుకులంలో ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి నాలుగు రోజులపాటు ఆటలు

వర్గల్(గజ్వేల్): బాలికల స్టేట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌కు సిద్దిపేట జిల్లా వర్గల్ జ్యోతిబా పూలే బాలికల గురుకులం ముస్తాబైంది. వర్గల్ గురుకులం వేదికగా బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాలకు చెందిన బీసీ గురుకులాల నుంచి దాదాపు 1650 మంది బాలికలు పోటీల కోసం తరలివస్తున్నారు.

క్రీడా ప్రాంగణం రెడీ

ఆటల పోటీల నిర్వహణకు వీలుగా వర్గల్ పూలే గురుకులంలో ఒకే ఆవరణలో ఉన్న డిగ్రీ కళాశాల, పాఠశాల ప్లే గ్రౌండ్లను సిద్ధం చేశారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో కోర్టులు, రన్నింగ్ ట్రాక్‌లను తీర్చిదిద్దారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలుగా పోటీలు జరుగుతాయి.

పోటీలు జరిగే క్రీడాంశాలు

విద్యాలయ వర్గాల ద్వారా తెలిసిన సమాచారం ప్రకారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్‌లో 100, 200, 400, 800, 1500, 3000 మీటర్ల వరుగు పోటీలు, 100మీటర్లు, 400 మీటర్ల రిలే రేసు నిర్వహిస్తారు. లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, చెస్ పోటీలు జరుగుతాయి. బుధవారం ఉదయం నుంచి పోటీలు మొదలవుతాయి.

అసైన్డ్ భూములపై సర్వ హక్కులు

బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే అసైన్డ్ భూములపై ఉన్న ఆంక్షలు ఎత్తివేసి లబ్ధిదారులు ఆ భూములు విక్రయించుకునే వీలు కల్పిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తెలిపారు. మండలంలోని దౌల్తాబాద్, సిరూర్, మాదాపూర్, మహబత్‌పూర్, శాపూర్, జంమ్గి, నల్లంపల్లి, శంషొద్దీన్‌పూర్ తదితర గ్రామాల్లో మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల హామీలను ప్రజలకు వివరించి ఇంటింటి ప్రచారం చేశారు. తనను మరోసారి గెలిపిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాల పాటు అధికారం ఇచ్చినా రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పెన్షన్ లాంటి పథకాలను ఎందుకు అమలు చేయలేదో ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని ఆ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దళితబంధు, గృహలక్ష్మి మంజూరుపై ఆందోళన చెందవద్దన్నారు. అర్హులందరికీ ఆయా పథకాలను అందించి వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, బాలయ్య, బస్వరాజ్ పాటిల్, సిద్దన్న పాటిల్, విఠల్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే పథకాలు బంద్

వటపల్లి(అందోల్): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని చంటి క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం పోతులబోగుడాలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఒక లీడర్ 3 గంటల కరెంట్ అంటాడు.. మరొకరు 5 గంటలు ఇస్తాం అంటారు.. బీఆర్ఎస్ 24 గంటలు ఇస్తుంది.. ఏది కావాలో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. కాంగ్రెస్ గారడీ మాటలు నమ్మితే అభివృద్ధి ఆగిపోతుందన్నారు. అందోల్ అభివృద్ధిపై చిత్తశుద్ధిలేని దామోదరను ఓడించి ఇంటికి పంపాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, లింగాగౌడ్ పాల్గొన్నారు.


రాయికోడ్ : మాట్లాడుతున్న క్రాంతికిరణ్

పతి కోసం ప్రచారం

టేక్మాల్(మెదక్): మండలంలోని పలు గ్రామాల్లో అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్ గెలుపు కోసం ఆయన సతీమణి పద్మావతి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి తన భర్తను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత స్వప్నరవి, సర్పంచ్ శ్రీనివాస్, వీరప్ప, సిద్దయ్య, భాస్కర్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.


హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

జోగిపేట (అందోల్): బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలో పార్టీ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌కు మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్, సార శ్రీధర్, శివ శేఖర్, జగన్ మోహన్‌రెడ్డి, షకీల్, సంతోష్, భవాని, నాగరత్నం, వెంకటేశం పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి


బూర్గుపల్లిలో మాట్లాడుతున్న కొట్టాల యాదగిరి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి

గజ్వేల్‌రూరల్: మత్స్యకారుల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి చేస్తూ వారికి అండగా నిలుస్తుందని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని బూర్గుపల్లిలో సర్పంచ్ విజయవర్ధన్‌రెడ్డితో కలిసి మంగళవారం మత్స్యకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కార్ మత్స్యకారుల ఉపాధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్‌లకు మత్స్యకార సంఘం సభ్యత్వం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని, గ్రామాల్లో ముదిరాజ్ సంఘాల భవనాల నిర్మాణం చేపట్టారన్నారు. గత ప్రభుత్వాలు ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణించాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సీఎం కేసీఆర్ మత్స్యకారుల ఆర్థికాభ్యున్నతికి కృషి చేశారన్నారు. నీలి విప్లవంలో అద్భుతాలను సృష్టించి దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణ నిలిచిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జగన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సత్యం, గజ్వేల్‌మండల అధ్యక్షుడు కొంటమైన నర్సింహులు, ప్రధాన కార్యదర్శి రమేష్, ఫిషరీస్ సొసైటీ చైర్మన్ చందు, ముదిరాజ్ సంఘం నాయకులు మనోహర్, భిక్షపతి, సత్తయ్య, రజనీకాంత్, యాదగిరి పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోను లాభాల బాటలోకి తేవాలి

డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

హుస్నాబాద్: ఆర్టీసీ సిబ్బంది హుస్నాబాద్ డిపోను లాభాల బాటలోకి తీసుకురావాలని డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. అక్టోబర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, అత్యధిక ఆదాయం తెచ్చిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. వివాహ శుభకార్యాలకు బస్సు బుకింగ్ చేయించిన ఉద్యోగులకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. శబరిమలకు రెండు సూపర్ లగ్జరీ బస్సులను బుకింగ్ చేయించాలన్నారు. డిపో సూపరింటెండెంట్ శ్రీధర్, అకౌంటెంట్ లక్ష్మారెడ్డి, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.


అభినందన సభలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

శాంతియుతంగా ఎన్నికలు జరగాలి

సిద్దిపేట సీపీ శ్వేత


మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శ్వేత

బెజ్జంకి(సిద్దిపేట): శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చూడాలని సీపీ శ్వేత సూచించారు. బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతలు, బహిరంగ సమావేశాల గురించి వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో ఏసీపీ సురేందర్‌రెడ్డి, సీఐ చేరాలు, ఎస్ఐ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

సిద్దిపేటరూరల్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ శ్వేత ఆదేశించారు. మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, ఎన్నికల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది నిర్వర్తించాల్సిన విధి, విధానాలపై అవగాహన కల్పించారు. సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి, రూరల్ సీఐ చేరాలు, ఎస్సై కిరణ్ రెడ్డిలను క్రిటికల్, నార్మల్ పోలింగ్ కేంద్రాల గురించి అడిగి తెలుసుకున్నారు. బైండోవర్ కేసుల గురించి, నాన్ బెయిలబుల్ వారెంట్ ఎగ్జిక్యూటివ్, ప్రైవేట్ గన్ డిపాజిట్, సీజ్ చేసిన డబ్బులు, ఫ్లాగ్‌మార్చ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. క్రిటికల్ పోలింగ్ బూతులు, నార్మల్ పోలింగ్ బూతులు, రూట్స్ రూట్ మొబైల్స్ గురించి పూర్తి అవగాహన ఉండాలన్నారు. నగదు, మద్యంపై ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ప్రతి మండల పరిధిలో 24 గంటలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేసేలా చూడాలన్నారు.